

దాతల సహకారం మరువలేనిది : ఎంఎల్ఏ

ప్రజాశక్తి - ఉండి

దాతల సహకారం మరువలేనిదని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. గురువారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కలిదిండి రామచంద్రరాజు జన్మభూమి పార్కులో జరిగే అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, చిన్నారులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమని, అందుకే 106 సంవత్సరాల చరిత్ర కలిగిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పార్కులో క్రీడలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, షటిల్ కోర్ట్, క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. మేజర్ పంచాయతీలో ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా దాతలు సమీకరించి అభివృద్ధి చేయడం జరుగుతుందని, దీనికి సహకరిస్తున్న దాతలను ఆగస్టు 15న సన్మానించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేనకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చేప ధర ఢమాల్..!

పెట్టుబడులు కూడా దక్కని వైనం
పెరిగిన మేత ధరలు
నష్టాలబాటలో ఆక్వా రైతులు



చేపల పట్టుబడి చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - కాళ్ల

రొయ్యల సాగే కాదు.. లాభాలు సంపాదించి పెడుతుందని భావించిన చేపల సాగు కూడా రైతులకు భారంగా మారింది. పెరిగిన పెట్టుబడులకు తగ్గట్టు ఆదాయం రాకపోవడంతో చేపల రైతులు నష్టాల బారిన పడుతున్నారు. చేపల ధర తగ్గిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఒకప్పుడు రైతులకు ఆర్థిక భరోసా ఇచ్చిన ఆక్వాసాగు ప్రస్తుతం నష్టాల దిశగా పయనిస్తోంది. చేపలు, రొయ్యల సాగు లాభాల దిశగా సాగినప్పుడు ప్రభుత్వానికి ఎన్నో కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్య రూపంలో ఆదాయం సమకూరింది. ప్రస్తుతం నష్టాలు ఎదురయ్యే సమయంలో టిడిపి కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలబడేలా పని చేయడం లేదని రైతులు అంటున్నారు.

ఒకవైపు చేపల ధరలు తగ్గడంతో పాటు మరోవైపు ఫీడ్ ధరలు విపరీతంగా పెరగడంతో పెట్టుబడి ఖర్చులు రాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు వాపోతున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆక్వా రైతులు చేపల పట్టుబడులు చేస్తున్నారు. ఇదే అదునుగా తీసుకుని చేపల కొనుగోలుదారులు రేట్లు తగ్గించేస్తున్నారని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

నష్టాలబాటలో ఆక్వా రైతుల సతమతం..

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల వరకూ చేపల సాగు జరుగుతోంది. ఈ రంగంపై ఆధారపడి లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం దిగుమతులు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లోని చేపల చెరువుల్లో కేజీన్నరకు పైగా బరువు పెరిగిన చేపలు పట్టుబడులకు సిద్ధంగా ఉన్నాయి. వీటికి రోజువారీ మేత కోసం ఎకరానికి రూ.వేలల్లో ఖర్చు పెడుతున్నారు. మేత ధరలు గణనీయంగా పెరగడం, చేప ధర తగ్గడంతో ప్రస్తుతం పట్టుబడులు నిలిపివేసిన చెరువుల్లో చేపలను బతికించుకోలేక, అదనపు పెట్టుబడులు పెట్టలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పట్టుబడి చేసిన చేపలు

పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన ఆకివీడు, భీమవరం, కైకలూరు, గణపవరం పరిసర ప్రాంతాల నుంచి దేశంలో అనేక ప్రాంతాలకు సుమారు 200 లారీల సరుకు రోజూ ఎగుమతి అవుతుంది. అయితే ఫీడ్ ధరలు ఆకాశాన్నంటడంతో జిల్లాలో ఆక్వా కల్చర్ సాగు అయోమయంలో పడిపోయింది. దీంతో సిరులు పండించిన తెల్ల చేప ఇప్పుడు నష్టాల ఊబిలోకి నెడుతోంది.

తగ్గిన చేప ధర..

చేపల మేత అయిన డిఒబి తవుడు మార్కెట్లో పది కిలోలు రూ.220 పలుకుతోంది. కొన్ని నెలల వ్యవధిలోనే అమాంతం దీని ధర పెరిగిపోయింది. గతంలో రూ.125 ఉన్న కిలో చేప ధర ప్రస్తుతం రూ.114-115లకు పడిపోయింది. చేప ధర తగ్గడం, మేత ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో జిల్లా రైతులు బెంబేలెత్తిపోతున్నారు. చేప కిలో పెరగాలంటే ప్రస్తుతం రూ.20 అదనంగా ఖర్చు అవుతోంది. మార్కెట్లో చేపల ధర మాత్రం పెరగడం లేదని, ఖర్చుకు తగ్గట్టు ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు.

రొయ్యల సాగు చేసినా వైరస్లు, ఇహెచ్పి, సెల్యూజ్లు, విబ్రియో పేరుతో నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆక్వారైతు రొయ్యల సాగు వదిలేసి చేపలు పెంచుతుంటే, నీటికాలుష్యంతో పలు రకాల వ్యాధులు ఆశించడం, మరోవైపు ఫీడ్ ధరలు కూడా విపరీతంగా పెరగడంతో పెట్టుబడి ఖర్చులు రాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు వాపోతున్నారు. ఇందులో ఒక్క ఈశాన్య రాష్ట్రాలకే రోజుకు 100 లారీలకు పైగా వెళ్తాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో, కృష్ణా డెల్టా ప్రాంతంలో అత్యధికంగా చేపల సాగు చేస్తున్నారు. గతంలో రైతులకు ఆర్థిక భరోసా ఇచ్చిన ఆక్వా సాగు నేడు నష్టాల దిశగా పయనిస్తోంది. చేపలు, రొయ్యల సాగు లాభాల దిశగా సాగినప్పుడు ప్రభుత్వానికి ఎన్నో కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్య రూపంలో ఆదాయం సమకూరేది. నేడు నష్టాలు ఎదురయ్యే సమయంలో ప్రభుత్వం రైతులకు అండగా నిలబడాలని రైతులు కోరుతున్నారు.

మేత ధరలు తగ్గించాలి..

కంతేటి శ్రీనివాసరాజు,ఆక్వారైతు, ప్రాతర్లమెరక



చేపల మేత ధరలు టన్నుకు రూ.5 వేలు పెరిగింది. కేజీ చేప ధర మొన్నటి వరకూ రూ.125 ఉండేది. ప్రస్తుతం రూ.115లకు కొనుగోలు చేస్తున్నారు. కేంద్రబడ్జెట్లో రొయ్యల మేత ధరలు తగ్గిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆ ఊసే లేదు. విద్యుత్ సబ్సిడీ 1.50 పైసలు అందిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించింది. ఆక్వాజోన్, నాన్జోన్లో సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి. విద్యుత్ పరికరాలు, విద్యుత్ ట్రాన్స్ఫర్లు సబ్సిడీపై అందించాలి.

నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

జిల్లా నుంచి నాణ్యమైన ఆక్వా ఉత్పత్తుల ఎగుమతికి, కార్మికుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ నాగరాణి ఆక్వా రైతులు, ఉత్పత్తిదారులు, డీలర్లు, ఎగుమతిదారులు, ఎంపెడా, మత్స్యశాఖ అధికారులతో సమావేశమై నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులు ఎగుమతులకు తీసుకోవాల్సిన చర్యలు, కార్మికుల సంరక్షణ, ఇన్సూరెన్స్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ భారతీయ రొయ్యల రంగంపై యుఎస్ మీడియా చేస్తున్న ఆరోపణలు, ప్రతికూల ప్రచారంతో రొయ్యల ఎగుమతిపై ప్రభావం పడుతోందన్నారు. ఆక్వాసాగులో రాష్ట్రంలో మన జిల్లా తృతీయ స్థానంలో ఉందన్నారు. కార్మికులు ఎక్కువ పని గంటలు, సరిపడాలేని వేతనాలు, కార్మిక ఒప్పందాలు లేకపోవడం, అపరిశుభ్రమైన వాతావరణంలో పని, సహ శ్రమ దోపిడీ పరిస్థితులను భరిస్తున్నారని యుఎస్ పత్రికలు ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పర్యావరణ నష్టం, రొయ్యల పెంపకం పద్ధతులు, నీటి వనరులను కలుషితం, యాంటీబయాటిక్స్ అధిక వినియోగం వలన వినియోగదారుల ఆరోగ్యానికి దోహదం చేస్తుందని ఆరోపణలు ఉన్నాయన్నారు. అలాగే ఆహార భద్రతా ప్రమాణాలను పాటించడంలో పరిశ్రమ విఫలమైందన్నారు. ఇది వినియోగదారుల ఆరోగ్యానికి ప్రమాదాలను కలిగిస్తోందని, భారతదేశం నుంచి దిగుమతి చేసుకున్న రొయ్యల భద్రత గురించి ప్రశ్నలు లేవనెత్తే కథనాలు ప్రచురించాయన్నారు. వాటిని గట్టిగా తిప్పికొట్టేందుకు ఆరంభంలోనే మేలుకోకపోతే ఆక్వారంగం పూర్తిగా దెబ్బతింటుందని, దీన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాలో ఆక్వా ఉత్పత్తుల్లో అత్యంత నాణ్యత, ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో ఉత్పత్తి చేయబడిన రొయ్యలలో 50 శాతం యుఎస్ఎకు ఎగుమతి అవుతున్నాయన్నారు. సుమారు లక్ష మంది ఆక్వారైతులు 3.5 లక్షల మంది ఆక్వా కార్మికులు, ప్రాసెసింగ్ రంగంలో సుమారు 2 లక్షల మంది కార్మికుల జీవనోపాధిని ప్రభావితం చేస్తోందన్నారు. జిల్లాలో 14 రొయ్యల హేచరీలు ఉన్నాయని, ఆక్వాకల్చర్ కింద ఉన్న మొత్తం 38,762 హెక్టార్లలో చెరువులు (చేప, రొయ్యలు) సాగులో ఉన్నాయన్నారు. రొయ్యల సాగులో ఉన్న మొత్తం 21,150 హెక్టార్లలో చెరువులలో, ఎంపెడా ద్వారా 14,987 హెక్టార్లలో చెరువులు మాత్రమే నమోదు చేయించుకోవడం జరిగిందన్నారు. మిగతా చెరువుల యజమాన్యాలు వెంటనే నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, జిల్లా ఎంపెడా అధికారి టిజి.మనోజ్ కుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్విఎస్.ప్రసాద్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ యు.మంగపతి రావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ కె.వెంకటేశ్వరరావు, ఔషధ తనిఖీ అధికారి అబిద్ అలీ షేక్ పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద న్యాయవాదుల ధర్నా

ప్రజాశక్తి - తణుకు



తహశీల్దార్కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

కేంద్ర ప్రభుత్వం జులై ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్న నూతన క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్, తణుకు బార్ అసోసియేషన్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలిండియా లాయర్స్ యూనియన్ ఉభయ జిల్లాల ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ కరోనా సమయంలో న్యాయవాదులతో గానీ, మేధావులతో గానీ కొత్త చట్టాలపై చర్చలు జరపకుండా పార్లమెంట్లో 142 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేసి ఆమోదించిన చీకటి చట్టాలన్నారు. ప్రజల స్వేచ్ఛ, వాక్కు స్వాతంత్ర హక్కులను హరించే చట్టాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ ప్రజలకు అనుగుణమైనవి ప్రజా జీవన విధానంతో ముడిపడిన చట్టాలను పాలకులు అమలు చేయాలన్నారు. దుర్మార్గమైన చట్టాలను అమలు చేయరాదన్నారు. ఈ చట్టాలను నిలుపుదల చేసి న్యాయవాదులతో మేధావులతో, ప్రజలతో చర్చించిన తర్వాతే అమలు చేయాలని ప్రతాప్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొండా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాలను నిలుపుదల చేయాలని బెంగాల్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసినట్లుగా ఆంధ్రప్రదేశ్లో కూడా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు షేక్ బాజ్జీ, పొట్ల శ్రీను, కంకటాల శ్రీను శ్రీనివాసు, గూడూరి సత్యనారాయణ, బి.రాజేష్, ఉండ్రాజుపు రాజేంద్ర, జువ్వల శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు పి.దక్షిణామూర్తి, జి.గోపి పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకునేందుకు ముందుకు రావాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

విద్యుత్ ఆదాకు సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. గురువారం కలెక్టరేట్లో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడానికి సమాచార వాల్పోస్టర్ను, కరపత్రాలను జిల్లా కలెక్టర్ నాగరాణి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నానాటికీ పెరుగుతున్న విద్యుత్ బిల్లులతో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం పడుతోందన్నారు. సమస్య పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఇంటి పై కప్పుపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుని ఉచిత విద్యుత్ పొందడమే కాకుండా మిగుల విద్యుత్తును విక్రయించి ఆదాయం పొందొచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకంతో జీవితాంతం ఉచిత కరెంటు పొందొచ్చన్నారు. ఇంటిపై సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. కిలో వాట్ సోలార్ రూఫ్ ఏర్పాటుకు రూ.65 వేలు ఖర్చవుతుందని, దీనిలో 30 వేల రూపాయలు ప్రభుత్వం రాయితీనే ఇస్తుందని, కేవలం రూ.35 వేలు ఖర్చు చేసుకుంటే జీవితాంతం ఉచిత విద్యుత్ పొందొచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ సామర్థ్యం కిలో వాట్ సుమారు 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ప్రస్తుతం వినియోగం ప్రకారం రూ.1000 బిల్లు వచ్చేది సోలార్ ఏర్పాటు వల్ల రూ.338 మాత్రమే విద్యుత్ బిల్లు సుమారు వస్తోందన్నారు. దీన్నిబట్టి సంవత్సరానికి సుమారు 8 వేల రూపాయలు ఆదా అవుతుందని తెలిపారు. ఈ పథకానికి తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు కూడా లభిస్తాయన్నారు. రాయితీపై వచ్చే సోలార్ రూఫ్ టాప్ ఇళ్లపై నిర్మించుకొని విద్యుత్ బిల్లును తగ్గించుకోవాలన్నారు. WWW.pmsuryaghar.giv.in/ APEPDCL వెబ్ సైట్ ద్వారా PMSURYAGHAR పోర్టల్లో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు

పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన వ్యక్తి బుద్ధదేవ్ భట్టాచార్య

చిత్రపటానికి నివాళులర్పించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

పీడిత ప్రజల విముక్తి కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి, బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. భీమవరం మెంటేవారి తోటలోని సిపిఎం కార్యాలయం వద్ద బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం సీనియర్ నేత బుద్ధదేవ్ భట్టాచార్యకు సిపిఎం జిల్లా కమిటీ గురువారం ఘనంగా నివాళులర్పించింది. బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ నాటి స్వాతంత్రోద్యమ కాలం నుంచి నేటి వరకూ కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు ప్రజల హక్కుల కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని అన్నారు. బెంగాల్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బుద్ధదేవ్, జ్యోతిబసు అనంతరం సిపిఎం కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారని అన్నారు. జ్యోతి బసు అడుగుజాడల్లో పార్టీ నిర్ణయాలను, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దిగ్విజయంగా పాలన సాగించారని తెలిపారు. బెంగాల్లో వామపక్ష కూటమి వేలాది ఎకరాల భూములను పేదలకు పంచిందని, విద్య, వైద్యం, ఉపాధి, కనీస వేతనాలు విషయంలో ప్రభుత్వం ఎన్నడూ వెనక్కి తగ్గలేదని అన్నారు. అందువల్లనే అక్కడి ప్రజలు వామపక్ష ప్రభుత్వాన్ని సుదీర్ఘ కాలంపాటు ఆదరించారని అన్నారు. నేడు ఉన్న పరిస్థితుల్లో మతోన్మాదం పెరుగుతోందని, దాన్ని నివారించాల్సిన అవసరం ఉందని అన్నారు. బెంగాల్లో ప్రజలు క్రమక్రమంగా భూములకు దూరం అవుతున్నారని, విద్యా, ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్న నేపథ్యంలో మళ్లీ ప్రజా పోరాటాల వైపు ప్రజలు అడుగులు వేస్తున్నారని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేసిన జ్యోతిబసు, బుద్ధదేవ్ భట్టాచార్య వంటి నేతలు ఈ వ్యవస్థకు అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జెఎన్వి గోపాలం, ఎం.వైకుంఠరావు, ఆంజనేయులు, వడుగు వెంకటేశ్వరరావు, రత్నకుమారి, నాగరాజు పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలని ధర్నా

ప్రజాశక్తి - యలమంచిలి



ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు, నేతలు

ఉపాధి హామీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఏనుగు వానిలంక గ్రామ పంచాయతీ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి హాజరై మాట్లాడుతూ యలమంచిలి మండల వ్యాప్తంగా కోటీ 65 లక్షల రూపాయల వేతనాల పెండింగ్లో ఉన్నాయన్నారు. ఒక్కో కార్మికునికి సుమారు ఐదు నుంచి 8 వారాల వేతనాల పెండింగ్ వల్ల ఆయా కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలను వెంటనే విడుదల చేసి కూలీలందరికీ న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మాసవరపు సుబ్బారావు, పాలపర్తి అప్పాజీ, కొల్లు కొండయ్య, మల్లుల శ్రీరాములు, నల్లి విజయలక్ష్మి, పాలపర్తి పెద్దరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి

రిటైర్డ్ సిబిఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ

నరసాపురం: విద్యార్థి తన భవిష్యత్ నిర్మాణానికి ముఖ్యంగా కావలసినది క్రమశిక్షణ అని, అది కలిగి ఉంటే తమ జీవితాన్ని ముందుకు తీసుకు వెళ్లగలమని రిటైర్డ్ సిబిఐ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీ నారాయణ అన్నారు. వైఎన్ కళాశాల హెచ్ఆర్డి కేంద్రం, ఐక్యూఎసి సంయుక్త ఆధ్వర్యంలో క్రమశిక్షణతో మెరుగైన భవిష్యత్ నిర్మాణం అనే అంశముపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రిటైర్డ్ సిబిఐ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీ నారాయణ విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పదిమందిని ప్రభావితం చేయాలన్నా, భవిష్యత్లో అనేక విజయాలు సాధించాలన్నా క్రమశిక్షణ మనల్ని ముందుకు నడిపిస్తుందన్నారు. మన జీవితంలో పైకి ఎదగాలంటే క్రమశిక్షణ, సంకల్పం, అంకితభావం, భక్తిభావం అనే నాలుగు అంశాలు ముఖ్యమైనవని, వాటిని మీరు జీవితంలో అలవాటుచేసుకుని పాటించినట్లైతే ఉన్నత శిఖరాలకు వెళతారనడంలో ఎటువంటి సందేహం ఉండదన్నారు. క్రమశిక్షణ అనే పదాన్ని ఇంగ్లీష్లో తీసుకుని వాటి సంఖ్యను కనుక కూడినట్లైతే అది వంద వస్తుందని, మనం మన చదువులలో వందకు వంద సంపాదించాలని ఎలా అనుకుంటామో, అది క్రమశిక్షణ నిరూపిస్తుందన్నారు. క్రమశిక్షణతో పాటుగా, వైఖరి లేదా ధోరణి(ఆటిట్యూడ్), దేశాన్ని ప్రేమించడం(ఐ లవ్ ఇండియా) అనే పదాలు కూడా కూడితే వంద వస్తాయని, కాబట్టి ఈ మూడు కూడా జీవితంలో ముఖ్యమన్నారు. వివేకానందుడు చెప్పిన 'శరీరానికి శిక్షణ, మనసుకు శిక్షణ, మాటకు శిక్షణ, ఆలోచనకు శిక్షణ' అనే నాలుగు అంశాలు కూడా మనల్ని జీవితంలో ఎదగడానికి, సమాజంలో గుర్తింపు రావడానికి సహకరిస్తాయన్నారు. క్రమశిక్షణను దాటి ప్రవర్తించి గుర్తింపు రావాలనుకున్న వ్యక్తి ఆ క్షణమే కానీ, భవిష్యత్లో ఉనికిని కోల్పోతాడన్నారు. ప్రస్తుతం యువత సెల్ ఫోన్ను ఎక్కువగా ఉపయోగిస్తూ, రీల్స్ చేస్తూ తమ భవిష్యత్ ఇదే అనుకుంటున్నారని, కానీ చదువు అయిపోయిన తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే శూన్యం కనిపిస్తుందన్నారు. అప్పుడు చదివి ప్రయోజకులు అవుదామన్నా మనకు సమయం ఉండదని, మన జీవిత ప్రయాణంలో అది ఒక అవరోధన అని, అందువల్ల సెల్ఫోన్ను భవిష్యత్ నిర్మాణానికి వినియోగించుకోవాలన్నారు. ప్రముఖ వ్యక్తుల జీవిత గాథలు తెలుసుకోవాలి లేదా చదవాలని, లక్ష్య సాధనకై ధ్యానం, ప్రాణాయామం వంటి ఆర్ట్ ఆఫ్ లివింగ్ నేర్చుకుంటే అవి మన నడవడికను, స్థిత ప్రజ్ఞతను పెంపొందిస్తాయన్నారు. అబ్దుల్ కలాం చెప్పినట్లుగా మన జీవితంలో మూడు లక్ష్యాలను అనగా, మన తల్లిదండ్రులు మనం సాధించిన విజయానికి భుజం తట్టి మెచ్చుకోవాలి, మన సంతకం ఒకరికి ఆటోగ్రాఫ్ కావాలన్నారు. మనం చదువుకున్న కళాశాలకే మనం ముఖ్య అతిథిగా వెళ్లడం అనే అంశాలు మిమ్మల్ని ఎంతో ఎత్తుకు నిలబెడతాయని, అవే మన భవిష్యత్ నిర్మాణానికి పునాదులని, వైఎన్ కళాశాలలో చదువుతున్న మీరు చాలా అదృష్టవంతులని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యానారాయణ రావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, అకడమిక్ అడ్వైజర్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రామాంజనేయరాజుకు పిహెచ్డి ప్రదానం

భీమవరం టౌన్: సామర్థ్యం తక్కువ ఉన్న సాయిల్స్ను కూడా ట్రీట్మెంట్ చేసి నిర్మాణ రంగంలో ఉపయోగించవచ్చునని చేసిన పరిశోధనకు గాను సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.రామాంజనేయరాజుకు ఎన్ఐటి వరంగల్ పిహెచ్డి ప్రధానం చేసిందని ఎస్ఆర్కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజ్మెంట్ మీటింగ్ హాల్లో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ, నిషాంత్ వర్మ డాక్టర్ రామాంజనేయ రాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామాంజనేయ రాజు మాట్లాడుతూ 'ఎక్స్పెమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ ది ఇంజనీరింగ్ బిహేవియర్ ఆఫ్ కెమికల్లీ స్టెబిలైజ్డ్ ఎక్స్పెన్సివ్ సాయిల్స్' అనే అంశంపై ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.హిరాలాల్, ఎస్ఆర్కెఆర్ ప్రొఫెసర్ డాక్టర్ బిఆర్.ఫణి కుమార్ల పర్యవేక్షణలో తాను చేసిన పరిశోధనకు ఎన్ఐటి వరంగల్ పిహెచ్డి ప్రధానం చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్, సివిల్ ఇంజనీరింగ్ నిపుణులు డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ ఎంతో విలువైన బ్లాక్ కాటన్ సాయిల్స్ను సమర్ధవంతంగా ట్రీట్మెంట్ చేసి నిర్మాణ రంగంలో ఉపయోగపడేలా పరిశోధనలు జరిపి, సొసైటీకి ఒక నూతన అంశాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన రామాంజనేయ రాజుకు అభినందనలు తెలిపారు. సహజ వనరులకు ప్రసిద్ధి చెందిన గోదావరి జిల్లాలో బ్లాక్ కాటన్ సాయిల్స్ను వినియోగంలోకి తీసుకొస్తే మరిన్ని నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరపటానికి ఆస్కారం ఉంటుందన్నారు. సివిల్ ఇంజనీరింగ్ పరిశోధనలు దేశ ప్రగతికి ఎంతగానో తోడ్పడతాయన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ ఎసిఎస్ వి.ప్రసాద్, సీనియర్ ప్రొఫెసర్ బిఆర్.ఫణి కుమార్ పాల్గొన్నారు. సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపక బృందం డాక్టర్ రామాంజనేయులను ప్రత్యేకంగా అభినందించారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్

ఆచంట: అధిక వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెలించాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో గురువారం పోడూరు మండలంలోని పలు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ వర్షాలవల్ల ముంపుకు గురై, నష్టపోయిన కౌలు రైతులకు ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం చెలించాలని డిమాండ్ చేశారు. నక్కలడ్రైన్ వల్ల ముంపుకుగురై ప్రతీసంవత్సరం రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నక్కల కాలువను ఆధునీకరించి రైతులను ఆదుకోవాలని కోరారు. మండల నాయకులు బొంతు శ్రీను, రాపాక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతులకు, ప్రజలకు మంచి సేవలందించాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

కో-అపరేటివ్ సంఘాలు, అనుబంధ బ్యాంకులను మరింత బలోపేతం చేసి రైతులకు, ప్రజలకు మంచి సేవలు అందించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేటులో కో-అపరేటివ్, వ్యవసాయ, జిల్లా పంచాయతీ, జిల్లా పశు సంవర్ధక, జిల్లా మత్స్య, డిఆర్డిఎ అధికారులతో సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘాలలో మల్టీపర్పస్ గోదాములు మరిన్ని నిర్మాణాలు చేసి రైతులకు వినియోగంలోకి తేవాలన్నారు. రైతులు పండించిన పంటను దాచుకోటానికి, గిట్టుబాటు ధర వచ్చినపుడు అమ్ముకోవడానికి ఈ లోపు రైతులకు దాచుకున్న ధాన్యానికి కూడా రుణ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలో 122 సహకార సంఘాలు ఉన్నాయని వీటి అన్నిటికి కంప్యూటరైజేషన్ చేయాలని, దీని ద్వారా రైతులు ఆన్లైన్లోను తీసుకోనుటకు, చెల్లించుటకు వెసులుబాటు కల్పించాలని, రైతులను బ్యాంకుల చుట్టూ తిరిగే అవకాశం ఉండదని జిల్లా కలెక్టర్ తెలిపారు. జాతీయ సహకార సమైక్య ద్వారా సహకార సంఘాలకు సభ్యత్వం కల్పించి, రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చాలని ఆమె తెలిపారు. జిల్లాలో సహకార సంఘాలలో జనరిక్ మెడికల్ షాపులు ఐదు మాత్రమే ఉన్నాయని, ఈ సంఖ్యను మరింత పెంచి ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు. జిల్లాలో సహకార సంఘాలలో రెండు పెట్రోలు బంకులు మాత్రమే ఉన్నాయని, మరో మూడు పెట్రోల్ బంకుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, ఉభయ జిల్లాల డిసిసిబి సిఇఒ ఎన్.తిలక్, డిసిసిబి జియం ఎ.మాధవి, డిసిఒ ఎం.నాగరాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వేంకటేశ్వర రావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఆర్.విక్టర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీ కృష్ణ, డిఆర్డిఎ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్విఎస్వి.ప్రసాద్, డిసిసిఒ కె.వేంకటేశ్వర రావు, డిపిడిఎం జి.తులసీధర్, మార్కెటింగ్ ఎఇ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తు నుంచి ఆదుకోవాలి
సిపిఎం విరాళాల సేకరణ

ఆకివీడు: ప్రకృతి విపత్తుకు గురైన ప్రజానీకాన్ని ప్రతి ఒక్కరూ మానవతా హృదయంతో ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు పిలుపునిచ్చారు. గోదావరి తీరంలోనూ, కేరళ వయనాడ్‌లోనూ సంభవించిన ప్రకృతి విపత్తులో నష్టపోయిన బాధితులను ప్రతి ఒక్కరూ ఆదుకుందాం అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు తమ శక్తి మేరకు సహకరించి బాధితులకు బాసటగా నిలవాలని కోరారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మండల కేంద్రం ఆకివీడులో విరాళాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని మార్కెట్లో ఇంటింటికీ, ప్రతి దుకాణానికి తిరిగి విరాళాలు సేకరించారు. విరాళాలను పార్టీ నిర్ణయం మేరకు బాధితులకు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు స్పందన, సూరిబాబు, బి.వి.వర్మ, బి.రాంబాబు, కె.తవుడయ్య, మురా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్స్ సర్వే

పెనుమంట్ర: ఈనెల 9 నుంచి 14 వరకు ఆరు రోజులు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో పల్స్ సర్వే జరుగుతుందని స్థానిక ఎంపిడిఒ పి.పద్మజ తెలిపారు. గురువారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ మండలంలోని ప్రతీ గ్రామంలోని ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఉన్నదీ, లేనిదీ తెలుసుకోవడం కోసం గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామంలో ఉన్న ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సర్వే చేపడుతూ జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

విద్యాదాత ఎంఆర్‌కె వర్ధంతి

వీరవాసరం: వీరవాసరం విద్యాదాత మద్దాల రామకృష్ణమ్మ(ఎంఆర్‌కె) 34వ వర్ధంతిని గురువారం వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్ అధ్యక్షతన గుద్దటి తాతాజీ, గాయత్రీదేవి, మద్దాల తాతారావులు ఎంఆర్‌కె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మద్దాల రామకృష్ణమ్మ వీరవాసరం పరిసర గ్రామాల ప్రజలకు ఆయన చేసిన విద్యాభివృద్ధి, దాతృత్వం గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దంతాల సంరక్షణపై అవగాహన అవసరం

ఆచంట: విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ దంతాలపై అవగాహన కలిగి ఉండాలని రత్నాస్ డెంటల్ హాస్పిటల్ వైద్యులు మేడపాటి మురళీ జోగిరెడ్డి అన్నారు. ఆచంట మండల మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆచంట రత్నాస్ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ మేడపాటి మురళీ జోగిరెడ్డి విద్యార్థులకు ఉచిత దంతపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంతాల పరీక్షలు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు టూత్ పేస్టులు, బ్రెష్‌లు ఉచితంగా అందజేశారు. వైద్యాధికారి మేడపాటి మురళీ జోగిరెడ్డిని మానవతా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత ఆచంట మండల శాఖ అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాద్, మండల శాఖ ఛైర్మన్ నంబూరి అంజిబాబు పాల్గొన్నారు.

రోగుల ప్రాణదాత డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు

పెనుమంట్ర: వైద్య సదుపాయాలు ఎక్కువగా అందుబాటులో లేని రోజుల్లో పశ్చిమగోదావరి వాసి డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు తమ పరిశోధనలతో రోగులకు ప్రాణదాతగా నిలిచారని మార్టేరు ఎస్‌విజి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిర్ల చిన సూర్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో డాక్టర్ ఎల్లాప్రగడ వర్ధంతి కార్యక్రమంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ సుబ్బారావు గారు తన జీవితాన్ని పరిశోధనలకే అంకితం చేశారని, నేడు వివిధ రోగాలకు మనం వాడుతున్న అనేక ఔషధాలను ఆయనే కనుగొన్నారని, తొలి టెట్రాసైక్లిన్(ఆరియోమైసిన్) ఔషధమును కనుగొని, అద్భుత ఔషధ సృష్టికి మంత్రగాడుగా ప్రపంచ ఖ్యాతి గడించారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు వి.దుర్గాదేవి, నరసింహ రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలుపుదల

పాలకొల్లు: నరసాపురం నుంచి వచ్చు 33 కెవి లైన్స్ మరమ్మతుల నిమిత్తం, పాలకొల్లు 11 కెవి లైన్స్ మరమ్మతుల నిమిత్తం పాలకొల్లు పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని విద్యుత్ అధికారులు తెలిపారు. ఆదివిపాలెం సబ్‌స్టేషన్, ఇన్నోర్ మార్కెట్ యార్డ్ పాలకొల్లు సబ్ స్టేషన్, ఎపిటిడిసిఒ సబ్‌స్టేషన్ పాలకొల్లులో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ నిలుపుదల చేయబడునున్నారు. పాలకొల్లు పట్టణ పరిధిలోని కొడిగట్లు, మార్కెట్ పేట, రామయ్యపేట, యార్ల వాని గురువు, బ్రాడీపేట బైపాస్ రోడ్, పెనుమదం రోడ్, లక్ష్మినగర్, బంగారువాని చెరువుగట్టు, శంభునిపేట, మెయిన్ రోడ్, వరిధనం రోడ్, సుబ్బారాయుడు గుడి వీధి, వెంకటేశ్వర కాలనీ, పెద్దపోస్ట్ ఆఫీస్ ఏరియా, మావుళ్లమ్మపేట, క్రిస్టియన్ పేట, నాగరాజు పేట, శాంతినగర్, బిఆర్‌ఎంవి స్కూల్, లాకోర్ట్, రామగుండం పేట, పెద్ద సాయిబాబా టెంపుల్, సోమేశ్వర అగ్రహారం, హెనానంద్ బోర్డ్, భీమవరం రోడ్, ఇవ్జ సముదాయములకు విద్యుత్ ఉండదని విద్యుత్ శాఖ ఏఇ బాబ్జీ తెలిపారు.

పాలకోడేరు: గొరగనమూడి సబ్ స్టేషన్‌లో 11 కెవి శృంగవృక్షం ఇండస్ట్రియల్ ఫీడర్, బంటుమిల్లి ఫీడర్, మోగల్లు సబ్‌స్టేషన్‌లో కొరుకొల్లు ఫీడర్స్ లైన్ మరమ్మతులు, చెట్లకొమ్మలు తొలగించు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పిటీ వర్మ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు నిలిపివేస్తామని తెలిపారు. శృంగవృక్షం, బంటుమిల్లి, పెన్నాడ, కొరుకొల్లు గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం: 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ హౌసింగ్ బోర్డు పరిధిలో 11 కెవి సత్యవతినగర్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎపి ఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్‌ఎన్ కాలనీ, వాసవిపురిగూడెం, వీకర్స్ కాలనీ, అబ్బులు కుంట సెంటర్, బాపూజీ పుంత రోడ్డు, యాగర్లపల్లి, కొబ్బరితోట ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. పట్టణ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

'ఆక్వా రైతులకు అండగా టిడిపి'

ఉండి: ఆక్వా రైతులకు టిడిపి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. గురువారం ఉండి మండలం పెదపుల్లేరు గ్రామంలో జనసేన కాళ్ల మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు ఆధ్వర్యంలో శ్రీరామ్ ఆక్వా ఫీడ్స్ అండ్ నీడ్స్ నూతన షాపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని కనుమూరి రఘురామకృష్ణంరాజు, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆక్వా రైతులను ఆదుకోవడం కోసం ఆక్వా జోన్‌ను నాన్ ఆక్వా జోన్ సంబంధం లేకుండా విద్యుత్ సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రామాంజనేయులు మేలైన మేత రకాలను రైతులకు అందించి వారి అభివృద్ధికి సహకరించాలని వారు సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, జనసేన పిఎసి సభ్యులు వేగేశ్న కనకరాజు సూరి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జుత్తిగ నాగరాజు పాల్గొన్నారు.

కొబ్బరిచెక్కల వేలంపాట ద్వారా రూ.5.67 లక్షలు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న ఉండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి కొబ్బరిచెక్కల వేలంపాట ద్వారా రూ.5.67 లక్షల సమకూరిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. యాత్రికులు అమ్మవారికి సమర్పించుకునే కొబ్బరిచెక్కలను ఒక సంవత్సరం పాటు తీసుకునేందుకు గురువారం ఆలయ ప్రాంగణంలో వేలంపాటను గుమ్ములూరులోని దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ వేలంపాటలో భీమవరం పట్టణానికి చెందిన నాగిడి సాంబమూర్తి పెద్దపాట పాడి సొంతం చేసుకున్నారని రామకృష్ణంరాజు తెలిపారు.

అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం

మొగల్తూరు: మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని న్యాయవాది బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చల్లా దానయ్య నాయుడు అన్నారు. ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార అథారిటీ వారి ఆదేశాల మేరకు నర్సాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం మొగల్తూరు మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఉండ్రు బాబ్జీ రాజు అధ్యక్షతన న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దానయ్య నాయుడు మాట్లాడుతూ పలుచట్టాల గురించి వివరించారు. న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ సభ్యులు వై.సతీష్, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ సిహెచ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లక్ష్యాలను సమన్వయంతో సాధించాలి : కలెక్టర్

భీమవరం : అక్టోబరు 2వ తేదీ నాటికి జిల్లాలో చెత్త నుంచి సంపద సృష్టించే 383 కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరును రెండు పూటలా పుష్కలంగా అందించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లో తాగునీరు, శానిటేషన్, వీధి ఎల్ఇడి లైట్స్, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, మండల స్థాయిలో గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు మూడురోజులు శిక్షణ కార్యక్రమాలు, హౌస్ టాక్స్, వంటి 15 అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగారాణి మాట్లాడుతూ జిల్లాలో 409 గ్రామ పంచాయతీలకు గాను 383 గ్రామపంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టించే షెడ్లు ఉన్నాయని అన్నారు. వాటిలో 166 మాత్రమే వినియోగంలో ఉన్నాయని, ఈ నెలాఖరు నాటికి 49 కేంద్రాలను, సెప్టెంబరు 15వ తేదీ నాటికి 74 కేంద్రాలను, మిగిలినవి సెప్టెంబరు 30వ తేదీ నాటికి వినియోగంలోకి తేవాలని, ఎట్టి పరిస్థితుల్లోను అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సంపద కేంద్రాలను సుందర వదనంగా తీర్చిదిద్దాలని, కేంద్రాల వద్ద శానిటేషన్, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద జిల్లాలో 1,50,158 అప్లికేషన్లును వెరిఫై చేసి సోమవారం లోపుగా పూర్తిస్థాయిలో నివేదికలు అందించాలన్నారు. మీకోసం పిజిఆర్ఎస్ పిటిషన్లను క్వాలిటీగా ఫిర్యాదుదారులు సంతృప్తి పొందేలా పరిష్కారం చూపాలన్నారు. కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వరదలు, అధిక వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో గ్రామంలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటిని పూర్తిస్థాయిలో క్లోరినేషన్‌తో శుద్ధి చేసి, ల్యాబ్లో నీటిని పరీక్షలు చేసి, అనంతరం సురక్షితమైన తాగునీరు రెండుపూటలా పుష్కలంగా ప్రజలకు అందించాలన్నారు. తాగునీరుని బాగా కాచి చల్లార్చి తాగాలని ప్రజలకు సూచించాలని, అవసరం అయితే ప్రజలకు టామ్ టామ్ వేసి తెలియజేయవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. జల జీవన్ మిషన్ పథకం అమలులో సమాజంలోని అట్టడుగు వర్గాలైన ఎరుకల, యానాది కుటుంబాలకు మంచినీళ్ల కుళాయిలను తప్పక రిజిస్ట్రేషన్ చేయించి మంజూరు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఆర్.విక్టర్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బివివి.నాగేశ్వరరావు, డిఎల్‌టిఓ ఎవి.అప్పారావు, డిపిఆర్‌సి కో-ఆర్డినేటరు ఎన్.ఎడ్వర్డు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గణపవరం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని గణపవరం ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాన్ని, ఇబ్బందులను విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకి కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మల కుమారి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలు, పొగాకు వంటివి ఆరోగ్యానికి హానికరమని అన్నారు. వాటికి దూరంగా ఉండి తమ విద్యాభివృద్ధిని కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్లు టి.అక్కిరాజు, సిహెచ్.చైతన్య, కె.స్వరూపరాణి, శ్రీనివాస్ రావు, వెంకటరమణ, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం : సిఐ నాగరాజు

భీమవరం టౌన్: సైబర్ నేరాల నివారణ, అవగాహన ప్రచార కార్యక్రమాలను జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు ప్రజాసంఘాల సహకారంతో ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని, ప్రజలు కూడా సహకరించాలని భీమవరం వన్ టౌన్ సిఐ ఆర్.నాగరాజు అన్నారు. గురువారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శ్రీవిజ్ఞానవేదిక రూపొందిన ప్లకార్డులు, బ్యానర్ల ప్రచార కార్యక్రమాన్ని సిఐ ప్రారంభించి మాట్లాడారు. విద్యావంతులు, ఉద్యోగస్తులు ఈ సైబర్ నేరాలకు గురవుతున్నారని, అపరిచితుల దగ్గర ఫోన్లు రిసీవ్ చేసుకోకూడదని, ఒటిపి నెంబర్లు, బ్యాంక్ అకౌంట్ వివరాలను ఎవరికీ ఇవ్వకూడదని అన్నారు. ఎడతెరిపి లేకుండా అవగాహనా కార్యక్రమాలను చేపడతామని సిఐ నాగరాజు తెలిపారు. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా రాజరాజేశ్వరి బాధ్యతలు

నరసాపురం: నరసాపురం తహశీల్దార్‌గా టి.రాజరాజేశ్వరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో నరసాపురం ఎఒగా పనిచేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ సీతారత్నం, రీసర్వే డీటీ నిర్మల జ్యోతి, సివిల్ సప్లై డీటీ నాగదేవి, ఆర్ఐ యశోద, విఆర్‌ఒలు, ఆఫీస్ సిబ్బంది రాజరాజేశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు సక్రమంగా అందేలా కృషిచేస్తానని ఆమె అన్నారు.

తల్లిపాలతో తల్లికి, బిడ్డకు రక్ష

వీరవాసరం: బిడ్డలకు తల్లిపాలివ్వడంతో ఉన్న అపోహలు నివృతం చేసుకోవాలని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం వీరవాసరంలో గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడుతూ బిడ్డలకు తల్లి పాలివ్వడం ద్వారా రొమ్ము కేన్సర్ రాకుండా చేసుకోవచ్చునన్న విషయాన్ని ప్రతీ తల్లి గ్రహించాలన్నారు. ఈ సందర్భంగా వైద్యురాలు తాజ్ మాట్లాడుతూ ఆరు నెలల వరకూ బిడ్డకు నీరు పట్టనవసరం లేదన్నారు. ప్రతీ బిడ్డ మూడు రోజులకు సరపడా ఆహారం నిల్వచేసుకుని పుడుతుందన్నారు. ఒక స్థనంలోంచి ముందుగా నీరు, తరువాత కొవ్వుతో కూడిన పోషకాలు ఉంటాయన్నారు. అందువల్ల ఒక స్థనంలో పాలు పూర్తిగా ఖాళీ అయిన తరువాత రెండో స్థనంలోని పాలు బిడ్డకు ఇవ్వాలని తెలిపారు.

నిరంతర కృషితోనే అసాధారణ స్థాయి


లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న యాజమాన్యం

నరసాపురం: సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో 2024-2025 బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జాయింట్ డైరెక్టర్ జెడి.లక్ష్మీనారాయణ విచ్చేశారు. విద్యార్థి జీవిత లక్ష్యాలు అనే అంశంపై మాట్లాడారు. ప్రతీ (ఇంజనీరింగ్) విద్యార్థి తన నాలుగు సంవత్సరాల విద్యాభ్యాసంలో అకాడమిక్స్‌తో పాటు, మొదటి సంవత్సరములోనే తన జీవిత లక్ష్యాన్ని ఎంచుకొని నిరంతర కృషితో ఆ లక్ష్యం దిశగా ప్రయాణించినట్లయితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. సాంకేతిక రంగంలో మార్పులలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థులు తమ మేధస్సును ఇన్నోవేటివ్‌గా ఆలోచించేలా ప్రయత్నం చేయాలన్నారు. అన్నింటిని నడిపేదే మానవ మేథస్సు మాత్రమే అని వివరించారు. ప్రతీ విద్యార్థి శారీరకంగా, మానసికంగా ధడంగా ఉన్నప్పుడే అన్నిస్థాయిలలోను ముందుకు వెళ్లగలరు అంటూ క్రీడలలో పాల్గొనడం, ప్రాణాయామం నిరంతరం చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి కేవీ స్వామి, కళాశాల డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కళాశాల పాలకవర్గ సభ్యులు, కళాశాల ప్రిన్సిపల్ డా.సురేష్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపిచంద్ పాల్గొన్నారు.

కళాశాలలో రక్తదాన శిబిరం

పాలకొల్లు: ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిఎస్‌టి డిపార్ట్మెంట్, రెడ్‌క్రాస్ సొసైటీ నరసాపురం ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు ప్రారంభించారు. అతిథిగా సీనియర్ ఆడిటర్ కలిదిండి రామరాజు విద్యార్థులకు డ్రింక్స్, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ మాట్లాడుతూ రక్తదానం అనేది ఒక సామాజిక బాధ్యతగా భావించాలని, రక్తదానం వల్ల నూతన ఉత్తేజం, ఉత్సాహం శరీరంలో కలుగుతుందని తెలిపారు. మూడు నెలలకు ఒకసారి రక్తదానం ఎన్నిసార్లైనా చేయవచ్చని, రక్తదానం ద్వారా మనిషి ప్రాణాల్ని, వారి కుటుంబాన్ని రక్షించిన వారౌతారన్నారు. రామరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి రక్తదానం చేయడం ద్వారా సామాజిక సేవా ధృక్పథాన్ని అలవరుతుందని, సమాజ శ్రేయస్సు, జాతి నిర్మాణంలో భాగస్వాములు అవుతారన్నారు. రక్తదానం చేసిన 36 మంది విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు రోటరీ అధ్యక్షులు చవాకుల నరేష్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దిరిశాల వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు రూ.15 వేలు రోటరీ సభ్యులు చవాకుల నరేష్‌కు పోలియో డ్రాప్స్ నిమిత్తం అందించారు.

ఆనాటి క్విట్ ఇండియా పిలుపు.. మరో ఉద్యమానికి మలుపు

క్విట్ ఇండియా దినోత్సవం వేడుకల్లో పలువురు వక్తలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆనాటి క్విట్ ఇండియా పిలుపు మరో ఉద్యమానికి మలుపు అని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా క్విట్ ఇండియా స్థూపం వద్ద క్విట్ ఇండియా దినోత్సవ సభ గురువారం నిర్వహించారు. ముందుగా అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఎస్‌టిఒ అల్లూరి రవివర్మ మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్ర ఉద్యమంలో ఒకే మాట ఒకే బాటగా ఉద్యమం సాగించారని, గ్రామగ్రామాన కులమతాలకు అతీతంగా సాగిన ఉద్యమానికి బ్రిటిష్ వారు భారతీయుల దేశభక్తికి ఆశ్చర్యపోయారని, నేటి యువత అటువంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ జి.మహేష్ మాట్లాడుతూ 1942 ముంబయిలో మహాత్మాగాంధీ క్విట్ ఇండియా ఉద్యమానికి శంఖారావం పూరించారని, ఆ పిలుపుతో ఉద్యమం మరింత ఉధృతంగా సాగిందని, ఆనాటి ఉద్యమంలో అంతా యువకులేనని తెలిపారు. జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్ రాజు, స్థూప పున్ణ నిర్మాణ కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.జేమ్సులు మాట్లాడుతూ భీమవరంలో క్విట్ ఇండియా ఉద్యమం చరిత్రలోనే సువర్ణ అధ్యాయంగా మిగిలిందని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ శ్రీఆదిత్య డిగ్రీ, డిఎన్ఆర్ డిగ్రీ, కెజిఆర్ఎల్ కళాశాల, సంస్కార్ స్కూల్‌లో విద్యార్థులకు 1942 క్విట్ ఇండియా ఉద్యమ చరిత్రపై వ్యాసరచన, మహనీయుల చిత్రపటాల డ్రాయింగ్ పోటీలను నిర్వహించామని, 127 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. అనంతరం శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులతో అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

పలుచోట్ల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల ఎన్నిక


నరసాపురం : ఎన్నికైన నూతన విద్యాశాఖ కమిటీ

నరసాపురం: మండలంలోని లింగనబోయినచర్ల గ్రామంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఛైర్మన్ ఎన్నిక జరిగింది. పాఠశాలకు అందుబాటులో ఉన్న ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలలో మండ్రు హేమలత ఛైర్మన్‌గా, సబ్బితి శ్రీనివాసు వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎం.రాధాకృష్ణ తెలియజేశారు. పేరెంట్స్ కమిటీ సభ్యులుగా మోకా రామకొండ, గుంపుల శ్యాంబాబు, కడలి చిన్నారి, కొల్లాబత్తుల మంజుప్రియ, చిన్నం శ్రీను, గోడి బేబీ, మోకా జలదుర్గ, ఉప్పాటి ఝాన్సీ, బొంగా పెద్దిరాజు, చోళ్ల బేబీ, ఉల్లంపర్తి పండు ఎన్నికయ్యారు. పాఠశాల అభివృద్ధిలో అందరూ తమ వంతు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు.

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి గురువారం ఎన్నికలు నిర్వహించారు. ప్రతి తరగతిలో సోషల్ కమ్యూనిటీ అనుసరించి ముగ్గురు సభ్యులను ఎన్నుకొన్నారు. అలా 15 మంది సభ్యులతో కూడిన వారికి ఛైర్మన్‌గా కరణం పాపారావు, వైస్ ఛైర్మన్ సున్నం కళ్యాణి ఎన్నుకోబడ్డారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఐదుగురు, కో-అప్టెడ్ సభ్యులుగా ఇద్దరుతో స్కూల్ యాజమాన్య కమిటీ మొదలైంది. అజెండా అంశాలు పాఠశాలలోని విద్యార్థుల వివరాలు, పాఠశాల పనితీరు, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, ప్రభుత్వం వారు పాఠశాల అభివృద్ధికి జమ చేయుచున్న నిధుల ఖర్చు, మధ్యాహ్న భోజనం పథకం అమలు, పాఠశాలకు మౌలిక వసతులపై చర్చ జరిగింది. పాఠశాల హెచ్ఎం సుఖం రాయపూడి భవానీ ప్రసాద్, చంద్రకళ, బొక్క భవాని దుర్గ పాల్గొన్నారు.

గణపవరం: మండలంలో గురువారం జల్లికొమ్మర ప్రాథమిక ఉన్నత పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలలో రామిశెట్టి నాగపాణి ఛైర్మన్‌గా ఎన్నికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కటకం సుందర కుమార్ తెలిపారు. వైస్ ఛైర్మన్‌గా కాసాని రత్నకుమారితో పాటు 13 మంది సభ్యులతో మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికైనట్లు చెప్పారు.

ఆచంట: మండల ప్రజాపరిషత్ హైస్కూల్‌లో గురువారం ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ఎస్ఎంసి ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎ.ఉషారాణి తెలిపారు. ఆచంట ఎంవిఆర్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్‌గా మల్లుల త్రిమూర్తులు, ఆచంట వేమవరంలో గుత్తుల వెంకటేశ్వరరావు, పెనుమంచిలి నార్జన దుర్గాప్రసాద్, కొడమంచిలి అయినపూడి జీవన్ కిరణ్, కోడేరు, గంధం ప్రవీణ్ పార్థ శ్రీనివాస్, భీమలాపురం కౌరు త్రిమూర్తులు, వల్లూరు ఎంపీపాలెం జోగి జోన్స్ కుమార్, కరుగోరుమిల్లి కొండేటి వెంకట్రావులు స్కూల్ మేనేజ్మెంట్ సభ్యులుగా ఎన్నికైనట్లు ఎంఇఒ తెలిపారు.

ఆకివీడు : జిల్లాలోనే అతిపెద్ద హైస్కూల్‌గా ఉన్న స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, అదనంగా బాలికల జూనియర్ కళాశాలతో సహా ఉన్న స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎన్నికలు చాలా ఆశాజనకంగా మారాయి. ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఈ బాలుర హై స్కూల్ బాలికల జూనియర్ కళాశాలల పాఠశాల మేనేజ్మెంట్ కమిటీకి జరిగిన ఎన్నికలు ఏ విధమైన సమస్య తలెత్తకుండా ప్రశాంతంగా జరిగాయి. ఇంతటి ప్రతిష్ఠాత్మక పాఠశాల కమిటీ ఛైర్మన్‌గా బొర్రా నాగ వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఛైర్మన్ ఎన్.సుభాకర్ ఎన్నికయ్యారు. వీరితోపాటు మరో 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి తరగతి నుంచి ముగ్గురు ప్రతినిధులు ఎన్నుకోబడ్డారు. ఆ ముగ్గురిలో ఇద్దరు మహిళలు అందులో ఒక ఎస్‌సిలుగాను నిబంధనల మేరకు ఎంపిక జరిగాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట పోతురాజు తెలిపారు. మొత్తం పాఠశాలలో 1010 మంది విద్యార్థులు ఉండగా 835 మంది తల్లిదండ్రులు ఉన్నారు. వారిలో 435 మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఛైర్మన్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ యు.శామ్యూల్ జాన్ తెలిపారు. 68 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 ఉన్నత పాఠశాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పాఠశాలల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు జరిగాయని ఎంఇఒ తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేయవలసిందిగా ఛైర్మన్‌లకు సూచించారు.

ఉండి: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి బి.జ్యోతి తెలిపారు. ఉండి మండలం పాందువ్వ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్మెత్స సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా చొక్కా భాగ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్‌గా మాదాసి అజయ్‌లను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

పెనుమంట్ర : ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యా కమిటీల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయని స్థానిక ఎంఇఒలు వై.లక్ష్మీనారాయణ, యు.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మండలంలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న మార్టేరు ఎస్‌విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా జాలెం చిన్న, వైస్ ఛైర్మన్‌గా కడలి రేవతి ఎన్నికయ్యారు. జుత్తిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా బి.లక్ష్మీకాంతం, వైస్ ఛైర్మన్‌గా కె.నరేష్, కో-ఆప్షన్ సభ్యులుగా వీరవల్లి సత్యనారాయణ, సబెళ్ల కమల ఎన్నికయ్యారు. మల్లిపూడి ఆర్ ప్రాథమిక పాఠశాలకు ఛైర్మన్‌గా పి.శిరీష కుమారి, వైస్ ఛైర్మన్‌గా పి.దివ్య, నత్తా రామేశ్వరం ఆర్ పాఠశాల ఛైర్మన్ సిహెచ్.జాన్సీ, వైస్ ఛైర్మన్‌గా పి.హారిక ఎన్నికయ్యారు.

యలమంచిలి : మండలంలోని చించినాడ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా రేపూరి రాంబాబు, వైస్ ఛైర్మన్‌గా విప్పర్తి ప్రశాంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ మెంబర్స్‌గా ముస్కాడి విజయకుమార్, వీరవల్లి లావణ్య, సత్తి దుర్గ, శెట్టిమి ఉదయకుమారి, వనమాడి కుమారి, లింగోలు రాజు, గరికపాటి ఆశాజ్యోతి, దుర్గ, కౌరు వీరాంజనేయులు, తోట సుబ్బలక్ష్మి, రేపూరి నాగలక్ష్మి, వడ్డి రారాజు, బత్తుల భారతి ఎన్నికయ్యారు.